వాయిస్ ఆఫ్
# వందే భారత్
TGTEL/25/A4812
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక
సంపుటి : 01| సంచిక : 69 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ సోమవారం | జూన్ 22, 2026



2లో..

# ఓట్, సీట్ చోరీలో బీజేపీ నిమగ్నం

- ఎస్ఐఆర్ ప్రక్రియ ఓట్ల తొలగింపుకే
- ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్‌కు 100 సీట్లు ఖాయం
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఎస్ఐఆర్ పేరిట కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యంపై దాడికి తెగబడుతోందని, గతంలో ఎన్నడూ ఇలాంటి దుస్థితి లేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హనుమకొండలో సోమవారం నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) శిక్షణా కార్యక్రమంలో ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన పాల్గొని ప్రసంగించారు. గతంలో ఓటును ఓటర్ల జాబితాలో జోడించే కార్యక్రమం జరిగితే.. నేడు కుట్రపూరితంగా ఓట్లను తొలగించే కార్యక్రమం జరుగుతోందని పీసీసీ చీఫ్ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓట్లను చోరీ చేసి అడ్డదారిన బీజేపీ గెలిచిందని దుయ్యబట్టారు. బీజేపీ కేవలం ఓట్లనే కాదు.. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటును కూడా కావాలనే నామినేషన్ తిరస్కరించి దొంగిలించిందని, ఇక దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ఓట్ల చోరీతో పాటు సీట్ల చోరీకి కూడా బీజేపీ పాల్పడుతోందని విమర్శించారు. పదేళ్లపాటు తెలంగాణను దోపిడీ చేసి ఇప్పుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పదేళ్ల దోపిడీ, అవినీతిని ప్రజలు మరిచిపోయారనే భ్రమలో కేటీఆర్ బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. "ఆస్తుల కోసం సొంత చెల్లిని ఇంటి నుంచి గెంటేసిన కేటీఆర్.. ఇక ప్రజలకు ఏం న్యాయం చేస్తారు?" అని ఆయన నిలదీశారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సీటు విషయంలో బీఆర్ఎస్ ప్రవర్తించిన తీరు బీజేపీకి బలం చేకూర్చేలా ఉందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సొంత ఎజెండాతో ముందుకు వెళ్తున్నారని, అందుకే వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు తాము ఇక్కడికి వచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల్లా దూసుకుపోతున్నాయని పీసీసీ చీఫ్ పేర్కొన్నారు. తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ వంద సీట్లు గెలవడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన ప్రతి కార్యకర్తను, నాయకుడిని గుర్తిస్తామని.. పదవుల కేటాయింపులో కాస్త ఆలస్యం జరిగిన మాట వాస్తవమే అయినా, భవిష్యత్తులో తప్పకుండా అందరికీ న్యాయం చేస్తామని ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం అందిస్తాం

- సీఎం రేవంత్ రెడ్డి
- దేవరకద్ర డీఆర్‌డీఓ ప్రాజెక్టును సత్వరం మంజూరు చేయాలి
- ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ


2లో..

## లారీ ఢీకొని డీటీఓ వెంకన్న దుర్మరణం

- భూపాలపల్లి జిల్లాలో ప్రమాదం..
- విధి నిర్వహణలో వాహనాలు తనిఖీ చేస్తుండగా దూసుకొచ్చిన బొగ్గు లారీ
- గణపురం మండలం చెల్పూరు శివారులో విషాదం..
- మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి


2లో..

## పదేళ్ల పాలనలో సంక్షేమం.. రెండేళ్లలో సంక్షోభం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రేవంత్ రెడ్డి రైతులకు మరణ శాసనం రాసిండు..
- పంటలు కొనే నాథుడే ఉండడు

2లో..


## చారిత్రక భువనగిరి ఖిల్లాకు పూర్వవైభవం


2లో..

- పర్యాటక శోభ కల్పిస్తాం
- మంత్రి జూపల్లి కృష్ణారావు
- గంటకు 300 మంది వెళ్లేలా రోప్‌వే నిర్మాణం..
- ఫోర్ట్ రిస్టోరేషన్‌తో మ్యూజియం ఏర్పాటు
- యాదాద్రి - భువనగిరి - కొలనుపాక - స్వర్ణగిరిలను కలుపుతూ ప్రత్యేక 'టూరిజం సర్క్యూట్'

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు పూర్తి సహకారం అందిస్తాం

- సీఎం రేవంత్ రెడ్డి
- దేవరకద్ర డీఆర్‌డీఓ ప్రాజెక్టును సత్వరం మంజూరు చేయాలి
- ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అన్ని అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హస్తిన పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో వారి నివాసంలో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో పలు కీలక రక్షణ మరియు అభివృద్ధి అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో తమ ప్రభుత్వం అన్నివిధాలా సహాయసహకారాలు అందిస్తుందని కేంద్రమంత్రికి సీఎం వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన టెర్మినల్ బిల్డింగ్, కార్గో, ఎమ్ఆర్ఓ, హ్యాంగర్ సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న భౌగోళిక పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ సంస్థలు తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అత్యంత అనుకూలమైన ప్రాంతమని, ఆ దిశగా దీనిని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్‌డీఓ/డీఆర్‌డీఎల్ సంస్థలు ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను సత్వరం మంజూరు చేసి, పనులను త్వరగా ప్రారంభించాలని కేంద్ర రక్షణమంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. అలాగే హైదరాబాద్‌లోని గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించిన రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించినందుకు గాను రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు

## పదేళ్ల పాలనలో సంక్షేమం.. రెండేళ్లలో సంక్షోభం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రేవంత్ రెడ్డి రైతులకు మరణ శాసనం రాసిండు..
- పంటలు కొనే నాథుడే ఉండడు

**వర్ధన్నపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమంతో విలసిల్లితే, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేండ్లలోనే రాష్ట్రంలో తీవ్ర సంక్షోభం నెలకొందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. "ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. ఇంటింటా సంక్షోభం తెచ్చింది" అంటూ ఆయన మండిపడ్డారు. సత్యసాయి కన్వెన్షన్ హాల్ నందు వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఎస్ఐఆర్ ప్రక్రియ, డిజిటల్ సభ్యత్వ నమోదు మరియు సోషల్ మీడియా శిక్షణ తరగతులకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు మరణ శాసనం రాశారని ఆరోపించారు. ఒకప్పుడు కేంద్రం చెప్తే వినడానికి మోదీ బ్రోకరా అన్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు అదే మోదీ చెప్పినట్లు వింటూ పంటలు కొంటామంటున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే సీజన్ నుంచి రైతన్నల పంటలు కొనే నాథుడే ఉండరని ఆందోళన వ్యక్తం చేశారు బీఆర్ఎస్ శ్రేణులను, నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్న రేవంత్ రెడ్డి ముఠాను, సదరు అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టేదే లేదని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా తీసుకొని డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. పార్టీ శ్రేణులు గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమై పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. ఈ శిక్షణ తరగతులలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, డా. తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు సతీష్ రెడ్డి, వాసుదేవ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్ బాబు, పార్టీ నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, లలిత యాదవ్ మరియు నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### నేను సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు.. హార్డ్‌వేర్ కూడా

"నేను కేసీఆర్ అంత మంచోడిని కాదు.. బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన కాంగ్రెస్ నాయకులు ఎక్కడికి పారిపోయినా, సప్త సముద్రాల అవతల దాక్కున్నా సరే ఎవరినీ వదిలిపెట్టను" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. తాను కేవలం సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు, అవసరమైతే హార్డ్‌వేర్ కూడానని.. ఎప్పుడు ఎలా మాట్లాడాలో, ఎప్పుడు గేర్ మార్చాలో తనకు బాగా తెలుసని స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశం పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్, డా.టి.రాజయ్య, శంకర్ నాయక్, పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, అరూరి రమేష్, నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని డీటీఓ వెంకన్న దుర్మరణం

- భూపాలపల్లి జిల్లాలో ప్రమాదం..
- విధి నిర్వహణలో వాహనాలు తనిఖీ చేస్తుండగా దూసుకొచ్చిన బొగ్గు లారీ
- గణపురం మండలం చెల్పూరు శివారులో విషాదం..
- మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి

**జయశంకర్ భూపాలపల్లి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సోమవారం ఒక అత్యంత విషాదకరమైన ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. జిల్లా రవాణా అధికారి వెంకన్న విధి నిర్వహణలో భాగంగా వాహనాల తనిఖీలు చేస్తుండగా.. బొగ్గు లోడుతో వెళ్తున్న ఒక లారీ అదుపుతప్పి ఆయనపైకి దూసుకురావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపురం మండలం చెల్పూరు శివారులోని రవాణా శాఖ కార్యాలయం ఎదుట డీటీఓ వెంకన్న సోమవారం ఉదయం సిబ్బందితో కలిసి సాధారణ వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో కేటీపీపీ వైపు నుంచి బొగ్గు లోడుతో వస్తున్న ఒక లారీ ఒక్కసారిగా అదుపుతప్పి, తనిఖీల్లో ఉన్న డీటీఓ వెంకన్నపైకి అత్యంత వేగంగా దూసుకెళ్లింది. ఈ ఘోర ప్రమాదంలో ఆయనకు తీవ్ర రక్తస్రావమై, కనురెప్ప మూసేలోపే అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి, లారీ డ్రైవర్ నిర్లక్ష్యంపై దర్యాప్తు ప్రారంభించారు. రవాణా శాఖలో సుదీర్ఘ కాలం పనిచేసి, నిబద్ధత గల అధికారిగా పేరు తెచ్చుకున్న వెంకన్న అకాల మరణంతో తోటి ఉద్యోగులు, సిబ్బంది కన్నీరుమున్నీరయ్యారు. డీటీఓ వెంకన్న మృతి పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంకన్న కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన మంత్రి.. విధి నిర్వహణలో ఉంటూ ఇలా ఒక బాధ్యతాయుతమైన అధికారి ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి భరోసా ఇచ్చారు.



## చారిత్రక భువనగిరి ఖిల్లాకు పూర్వవైభవం

- పర్యాటక శోభ కల్పిస్తాం
- మంత్రి జూపల్లి కృష్ణారావు
- గంటకు 300 మంది వెళ్లేలా రోప్‌వే నిర్మాణం..
- ఫోర్ట్ రిస్టోరేషన్‌తో మ్యూజియం ఏర్పాటు
- యాదాద్రి - భువనగిరి - కొలనుపాక - స్వర్ణగిరిలను కలుపుతూ ప్రత్యేక 'టూరిజం సర్క్యూట్'

**యాదాద్రి భువనగిరి, వాయిస్ ఆఫ్ వందేభారత్ :** శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన పురాతన భువనగిరి ఖిల్లాకు పూర్వవైభవం తీసుకువచ్చి, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక శోభ కల్పిస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. సోమవారం ఉదయం భువనగిరి ఖిల్లా పైకి నిర్మించ తలపెట్టిన 'రోప్‌వే' స్థలాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలతో కలిసి మంత్రి జూపల్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. భువనగిరి కోటను సంరక్షించేందుకు 'ఫోర్ట్ రిస్టోరేషన్' పనులు చేపడతామని, ఇక్కడి అద్భుత చరిత్రను నేటి తరానికి తెలిపేలా ఒక అత్యాధునిక మ్యూజియంను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఖిల్లా పైకి పర్యాటకులు సులభంగా వెళ్లేందుకు వీలుగా, గంటకు 300 మంది ప్రయాణించే సామర్థ్యంతో రోప్‌వే ప్రాజెక్టును నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక హబ్‌గా మార్చేందుకు



గాను.. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భువనగిరి ఖిల్లా, చారిత్రక జైన క్షేత్రం కొలనుపాక సోమేశ్వర ఆలయం, ఇటు సమీపంలోని స్వర్ణగిరి క్షేత్రాలను కలుపుతూ ఒక భారీ 'టూరిజం సర్క్యూట్'ను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వెనుకబడిన టూరిజం శాఖను ప్రక్షాళన చేసి, దేశంలోనే నంబర్ వన్‌గా నిలబెడతామన్నారు. తెలంగాణలో దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఎన్నో చారిత్రక కట్టడాలు, ప్రకృతి రమణీయ ప్రాంతాలు ఉన్నాయని మంత్రి గుర్తు చేశారు. వీటన్నింటినీ ప్రభుత్వ మరియు ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయడం ద్వారా వందలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మానసిక ఉల్లాసానికి, ఆలోచనా విధానంలో మార్పునకు పర్యాటక స్థలాలు ఎంతో దోహదపడతాయని.. అందుకే ప్రజలంతా కనీసం నెలకు రెండు రోజులైనా తమ కుటుంబాలతో కలిసి తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, జూన్ 22, 2026

# యోగాతో మానసిక ఒత్తిడి దూరం..

- అసిస్టెంట్ కమాండెంట్ బాలయ్య
- మామునూరు నాలుగో బెటాలియన్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**మామునూరు, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** స్థానిక నాలుగో బెటాలియన్ ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా అసిస్టెంట్ కమాండెంట్ కె. బాలయ్య హాజరయ్యారు. 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' సంస్థ ప్రతినిధుల ఆధ్వర్యంలో బెటాలియన్ అధికారులు, సిబ్బందితో కలిసి యోగాసనాలు సాధన చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ బాలయ్య మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో మానవ శరీరంలో తలెత్తే అనేక ఆరోగ్య సమస్యలకు మానసిక ఒత్తిడే ప్రధాన కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం యోగా చేయడం వల్ల ఒత్తిడి చాలా వరకు దూరమవుతుందని, నిద్రలేమి, మానసిక ఆందోళనలు తగ్గుముఖం పడతాయని తెలిపారు. క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల గుండె జబ్బులు, రక్తపోటు వంటి దీర్ఘకాలిక



సమస్యలు దూరమవుతాయని నిపుణులు చెబుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా కంప్యూటర్ల ముందు కూర్చుని పనిచేసే వారికి వచ్చే నడుము నొప్పి, మెడనొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుందని, శరీరం ఫ్లెక్సిబిలిటీగా మారుతుందని సూచించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సభ్యుడు భాస్కర్ బెటాలియన్ సిబ్బంది చేత వివిధ రకాల ఆసనాలు వేయించి, వాటి ప్రాధాన్యతను వివరించారు. యోగా అనేది మన ప్రాచీన భారతీయ సంప్రదాయం మనకు అందించిన అమూల్యమైన బహుమతి అని కొనియాడారు. యోగా అంటే కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, మనసు, శరీరం, ఆలోచనలను ఒకే తాటిపైకి తెచ్చి.. ప్రకృతితో, ప్రపంచంతో ఏకత్వాన్ని కనుగొనే అద్భుతమైన మార్గమని స్పష్టం చేశారు. యోగా సాధన ద్వారా ప్రతి ఒక్కరూ జీవితంలో అద్భుతమైన పురోగతి సాధించవచ్చని తెలిపారు. ఈ వేడుకల్లో అసిస్టెంట్ కమాండెంట్లు ఈ.వీరన్న, జె.రాజేందర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు విజయ్, రాజ్ కుమార్, కృష్ణ, బెటాలియన్ అధికారులు, సిబ్బందితో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి వైష్ణవి పాల్గొన్నారు.

# లయన్స్ యూత్ క్లబ్ అధ్యక్షుడిగా బచ్చు వంశీకృష్ణ



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వేములవాడ లయన్స్ యూత్ క్లబ్ అధ్యక్షుడిగా బచ్చు వంశీకృష్ణ నియామకమయ్యారు. మున్నూరు కాపు కల్యాణ మండపంలో జరిగిన లయన్స్ యూత్ క్లబ్ సమావేశంలో బచ్చు వంశీకృష్ణను లైన్స్ క్లబ్ అధ్యక్షునిగా సీనియర్ లయన్ అనంతుల శివప్రసాద్ ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా కొమ్మ నటరాజ్, కోశాధికారిగా డాక్టర్ వినయ్ లను నియమించినట్లు ఆయన తెలిపారు. వీరితో పాటు 14 మంది డైరెక్టర్లను నియమించారు. నియమితులైన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన బచ్చు వంశీకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో లయన్స్ యూత్ క్లబ్ అధ్యక్షునిగా నియామకానికి సహకరించిన లయన్స్ క్లబ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులందరినీ ఏకతాటిపై తీసుకువచ్చి లయన్స్ యూత్ క్లబ్ సేవలను మరింత విస్తృత పరుస్తామన్నారు. ప్రజలకు విరివిగా సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. పర్యావరణ రక్షణ కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. క్లబ్బు సభ్యత్వం పెంచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చీకటి సంతోష్ కుమార్, తీగల వెంకటేశ్వరరావు,రాపెల్లి శ్రీధర్, మారం కుమార్, డాక్టర్ ఆనంద్ రెడ్డి, నగుబోతు రవీందర్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# మార్షల్ ఆర్ట్స్‌లో శ్రీ చైతన్య విద్యార్థి ఘనత

- ప్రతిష్ఠాత్మక బ్లాక్ బెల్ట్ సొంతం
- విద్యార్థికి యాజమాన్యం ఘన సత్కారం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కరాటే గ్రేడింగ్ పరీక్షల్లో వేములవాడకు చెందిన విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచి బ్లాక్ బెల్ట్ సాధించినట్టు రాజన్న సిరిసిల్ల ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఫౌండర్, మాస్టర్ అబ్దుల్ మన్నాన్ తెలిపారు. కరీంనగర్ పట్టణంలోని ఇంగ్లీష్ యూనియన్ స్కూల్‌లో ఆదివారం ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. వేములవాడ ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ మాస్టర్ అబ్దుల్ మన్నన్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న శ్రీ చైతన్య పాఠశాల పదో తరగతి విద్యార్థి దూలం యశ్వంత్ ఈ పరీక్షల్లో తన సత్తా చాటాడు. కరాటేలో అత్యంత కఠినమైన కటాస్, కుమిటే విన్యాసాలను అద్భుతంగా ప్రదర్శించి ప్రతిష్ఠాత్మక 'బ్లాక్ బెల్ట్' కైవసం చేసుకున్నాడు. ఒకినావా మార్షల్ ఆర్ట్స్ చీఫ్ ఎగ్జామినర్ కే. వసంత్ కుమార్ చేతుల మీదుగా యశ్వంత్ బ్లాక్ బెల్ట్‌తో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు. కరాటే గ్రేడింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన యశ్వంత్‌ను ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ జిల్లా అధ్యక్షులు కొండ దేవయ్య, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం ముద్రకోల రాజు, ప్రిన్సిపాల్ సుదీష్ కుమారి ప్రత్యేకంగా అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి పాఠశాల కీర్తిని దశదిశలా చాటడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే శిక్షకులు కొమురవెల్లి భూమేష్, చింతకుంట తిరుపతి పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** యోగాతో సంపూర్ణ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని యోగ గురూజీ రామస్వామి, శ్రీనివాస్ గౌడ్, జగదీష్,లు తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వాసవి నిత్య యోగ సమితి ఆధ్వర్యంలో యోగ ఆసనాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో కన్యకా పరమేశ్వరి దేవాలయం ఆవరణంలో గత 15 సంవత్సరాలుగా నిత్య యోగ సమితి ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యోగా దినోత్సవం సందర్భంగా కన్యకా పరమేశ్వరి దేవాలయం నుండి పట్టణ ప్రధాన రహదారి నుండి అంబేద్కర్ కూడలి వద్దకు ర్యాలీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈర్యాలీలో నరేందర్ పూల, మంత్రాల వేణుగోపాల్, జగదీశ్వర్,పాండురంగం, కిషన్ కుమార్, నరేందర్, వినోద్ కుమార్, శివ వేణుగోపాల్, శ్రీనివాస్, విజయ్, రజనీకాంత్,శంకర్ నాయక్, సాయిప్రసాద్,నిరంజన్, సాయిరాం, హరిక్రిష్ణ, పలుస గోపాల్, వెంకటేశ్ గౌడ్, రఘువీర్ ,బాలాజీ,మహేశ్, సాయిశంకర్, శ్రీనివాస్,నాగరాజు, ప్రసాద్ లు పాల్గొన్నారు.

# ఏకాగ్రత పెంపునకు ఏకైక సాధనం యోగ



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రభుత్వ డీగ్రీ కళాశాల అమ్రాబాద్ లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ కె.గోపాల్ విద్యార్థులకు యోగ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి మరియు భావోద్వేగాలను నియంత్రించుకోవడానికి, ఒత్తిడిని జయించడానికి యోగా అత్యుత్తమైన సాధనమని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులకు ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని పెంచడానికి విలువైన సాధనమని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎ.చంద్రయ్య విద్యార్థులచే యోగాసనాలు వేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.రాధ, జి.ఆంజనేయులు, బీ.రమేష్, టి.మహేష్ గౌడ్, ఎన్. మల్లయ్య, అధ్యాపకేతర సిబ్బంది ఎండీ.యూనిస్, ఎం.రామకృష్ణ, టి.కృష్ణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# చెక్కపల్లి జెడ్పీ పాఠశాలలో..



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం యోగా వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకిని కిషన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఉత్సాహంగా పాల్గొని వివిధ రకాల యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లోకిని కిషన్ మాట్లాడుతూ.. నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని, దీని ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత లభిస్తుందని విద్యార్థులకు వివరించారు. యోగాసనాల అనంతరం విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాల సిబ్బంది వారికి ప్రత్యేక పోషకాలతో కూడిన సాత్వికాహారాన్ని పంపిణీ చేశారు. క్యారెట్, బీట్‌రూట్, దోసకాయ ముక్కలకు తేనెను కలిపి తయారు చేసిన ఈ ఆహారాన్ని విద్యార్థులకు అందించడం విశేషం. ఈ ఆరోగ్యకరమైన వేడుకలో 60 మంది విద్యార్థులు, 9 మంది ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
సోమవారం, జూన్ 22, 2026

# ఎస్సీ బాలుర వసతి గృహ సమస్యలను పరిష్కరించాలి



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** స్థానిక పట్టణ కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎండీ సయ్యద్ డిమాండ్ చేశారు. వసతి గృహంలోని పరిస్థితులను పరిశీలించేందుకు సోమవారం యూఎస్ఎఫ్ఐ బృందం హాస్టల్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా ఎండీ సయ్యద్ మాట్లాడుతూ.. వసతి గృహంలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాత్రూమ్‌ల తలుపులు విరిగిపోయి సరిగ్గా లేవని, పరిసరాలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో తీవ్ర అపరిశుభ్రత నెలకొందని మండిపడ్డారు. ఇటువంటి దుస్థితి వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, భయంకరమైన వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అచ్చంపేట ఎస్సీ బాలుర హాస్టల్‌ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని, అక్కడి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ నాయకులు మహేష్, శ్రీకాంత్, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# అచ్చంపేటను డ్రగ్స్ రహితంగా మారుస్తాం

## డీఎస్పీ పల్లె శ్రీనివాసులు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అచ్చంపేటను పూర్తిగా మాదకద్రవ్యాలు లేని డ్రగ్స్ రహిత పట్టణంగా మార్చడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ పల్లె శ్రీనివాసులు తెలిపారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఇచ్ దయాన్ పాఠశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ పల్లె శ్రీనివాసులు మాట్లాడుతూ.. డ్రగ్స్ మహమ్మారి వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాకుండా, వారి కుటుంబాలు రోడ్డున పడతాయని, తద్వారా సమాజంపై తీవ్రమైన చెడు ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా అనుమానాస్పదంగా గంజాయి, డ్రగ్స్ వంటివి విక్రయిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో అచ్చంపేట సీఐ నాగరాజు, ఎస్సై సద్దాం హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** అచ్చంపేట మండలం నడింపల్లి గ్రామానికి చెందిన కుంద ఆనంద్ ఇటీవల మరణించడంతో, వారి కుటుంబానికి తాపీ మేస్త్రీల సంఘం అండగా నిలిచింది. మృతుడి కుటుంబ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సంఘం తరఫున రూ.10,000 ఆర్థిక సహాయాన్ని సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గాలిగూటి జగదీష్ నడింపల్లిలోని మృతుడి నివాసానికి సంఘ సభ్యులతో కలిసి వెళ్లి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రీల సంఘం కార్యదర్శి సూర్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిచంద్ర, సంఘం ప్రముఖ నాయకులు వెంకటయ్య, అర్జున్, ఆనందం, ఎల్లికంటి నిరంజన్, రామ్‌చందర్, శ్రీనివాసులు, ఖాజా, సూరయ్య, పర్వతాలు, తిరుపతయ్య, సైదులు పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం

■ హెచ్ఎం విక్కుర్తి లక్ష్మీనారాయణ



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని న్యూ అర్బన్ కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న హప్సిబా రెచల్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఆమె చేతుల మీదుగా పాఠశాల ప్రాంగణంలో మొక్కను నాటించారు. ఈ సందర్భంగా ఆ మొక్క సంరక్షణ బాధ్యతను సదరు చిన్నారికే అప్పగించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. భూమండలంపై రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రాణవాయువు శాతాన్ని పెంచేందుకు వృక్షాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. సకాలంలో వర్షాలు కురవాలన్నా, ప్రకృతి విపత్తుల నుంచి భూమిని కాపాడుకోవాలన్నా పర్యావరణ సమతుల్యత అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. మొక్కలు నాటడం అనేది కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా, ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో ఒక భాగం కావాలని ఆకాంక్షించారు.ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో జరిగే పుట్టినరోజులు, పెళ్లిరోజులు వంటి ప్రతి శుభకార్యానికి గుర్తుగా విధిగా రెండు మొక్కలు నాటే సంప్రదాయాన్ని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ప్రాథమిక పాఠశాల దశ నుంచే పిల్లలకు మొక్కల పెంపకం, ప్రకృతిపై అవగాహన పెంచేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చొరవ చూపాలని కోరారు. ఇళ్ల పరిసరాల్లో సులభంగా పెరిగే నీడనిచ్చే చెట్లు, పూల మొక్కలు, పండ్ల రకాలను ఎంచుకోవాలని.. అటవీశాఖ లేదా స్థానిక నర్సరీల ద్వారా వీటిని సులభంగా పొందవచ్చని ఆయన వివరించారు.నాటిన ప్రతి మొక్కను రక్షించుకున్నప్పుడే పర్యావరణ కాలుష్యాన్ని అదుపు చేయగలమని స్పష్టం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, దాసరి సుజాత, అంగన్‌వాడీ టీచర్లు లిక్కిడి మంజుల, పులి శారద, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఇది స్కీమ్‌ల ప్రభుత్వం కాదు.. స్కామ్‌ల ప్రభుత్వం

- మాజీ మంత్రి హరీష్ రావు
- రైతుబంధు, ఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వడంలో కాంగ్రెస్ సర్కార్ ఘోర వైఫల్యం
- అచ్చంపేట బీఆర్ఎస్ కార్యకర్తల సమ్మేళనం
- రేవంత్ రెడ్డిపై హరీష్ రావు, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మేలు చేసే స్కీమ్‌ల ప్రభుత్వం కాదని, కేవలం అవినీతికి పాల్పడే స్కామ్‌ల ప్రభుత్వమని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఎద్దేవా చేశారు. సోమవారం అచ్చంపేట పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అచ్చంపేట బీఆర్ఎస్ కార్యకర్తలు నీతికి, నిజాయితీకి మారుపేరని, వారంతా నిజమైన పులిబిడ్డలని కొనియాడారు. ఈ సందర్భంగా హరీష్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ అని, మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. బ్యాంకులో కుదువ పెట్టిన భూమిని అమ్మేసిన ఘనత ఆయనదని, దీనిపై అధికారులు ప్రశ్నిస్తే సదరు బ్యాంకునే నిషేధిస్తానని అనడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాలలో మూడు సార్లు రైతుబంధు ఇవ్వకుండా రైతన్నలను ముంచారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ హయాంలో కరోనా లాంటి కష్టకాలంలోనూ కేసీఆర్ పట్టుబట్టి రైతుబంధు వేసి రైతులను ఆదుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులకు ఈ ప్రభుత్వం రూ.29,300 కోట్లు బకాయి పడిందని హరీష్ రావు తెలిపారు. 45 రోజుల్లో యాసంగి రైతుబంధు ఇస్తానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అన్ని పంటలకూ బోనస్ ఇస్తామని చెప్పి, ఇప్పుడు సన్న వడ్లకే పరిమితం చేశారని.. కేంద్రం కొనమన్న పంటలనే కొంటామంటూ కొత్త పల్లవి అందుకున్నారని దుయ్యబట్టారు. రైతులకు ఇవ్వడానికి పైసలు లేవనే సీఎం, జూబ్లీహిల్స్‌లో రూ.100 కోట్లతో క్యాంపు కార్యాలయం కట్టడానికి, దాని చుట్టూ రూ.17 కోట్లతో ఇనుపకంచె వేయడానికి నిధులు ఎక్కడి నుంచి తెస్తున్నారని నిలదీశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువుల కోసం రూ.19,500 కోట్లు ఫీజ్ రియంబర్స్మెంట్ అందించిందని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో ఇంజనీరింగ్ విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా రాని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లకు వేల కోట్లు కేటాయించినట్లు చూపిస్తూ, ఆచరణలో నయాపైసా ఇవ్వడం లేదని విమర్శించారు. ఎస్ఐఆర్ (SIR) ఓటర్ల జాబితా సవరణలో బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని, వచ్చే ఎన్నికల్లో పాలమూరు గడ్డపై 14 సీట్లు గెలవడమే లక్ష్యమని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ యాప్ ద్వారా కుట్రపూరితంగా ఓట్ల ఏరివేత జరుగుతోందని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో ఈ విధానం ద్వారానే బీజేపీ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. బ్రతికున్న వారిని చనిపోయినట్లు, స్థానికంగా ఉన్నవారిని వలస వెళ్లినట్లు తప్పుడు నివేదికలు రాస్తూ సమాచారం లేకుండా ఓట్లు తొలగిస్తున్నారని, కార్యకర్తలు దీనిని ఎప్పటికప్పుడు గమనించి అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఈ భారీ కార్యకర్తల సమ్మేళనంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, జైపాల్ యాదవ్, వి. శ్రీనివాస్ గౌడ్, ఆళ్ల వెంకటేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మనోహర్, సభ్యత్వ నమోదు ఇంచార్జి శుభప్రద్, శ్రీకాంత్ భీమా, మాజీ మున్సిపల్ చైర్మన్ నరసింహ గౌడ్, పట్టణ అధ్యక్షుడు రమేష్ రావు తదితరులు పాల్గొన్నారు.

